ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 15 మార్చి 2025 | 5



మీరే నా బలం : జనసైనికులకు పవన్ అభివాదం



మీ వెంటే..

జన పవనాలు!



ఇదీ నా సేన : జయకేతనం సభ వేదికపై పవన్‌తోపాటు నాయకులు



అంతా ఓకేనా : నాదెండ్లతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్



అభిమానమే.. బలం : జయకేతనం సభ వేదికపై మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్



జన సైనికులమే : సభా వేదికపై ఆశీనులైన మహిళలు.. ఇతర నాయకులు



ఎగసిపడిన పవన్ అభిమానం





జనసైనికులే జనసేన బలం

- బంధం.. అనుబంధం మీరే
- మీ అందరి శ్రమతోనే అధికారంలోకి..
- వైసీపీ అరాచకాలను బద్దలు కొట్టాం
- మమ్మల్ని మీరే క్రమశిక్షణలో ఉంచాలి
- చిత్రాడ సభలో పవన్ కల్యాణ్
- అంచనాలకు మించి జనం
- మధ్యాహ్నానికే నిండిన వేదిక
- చోటులేక బయట వేలల్లో
- అదిరిపోయిన ఏర్పాట్లు
- వహ్వా అనిపించిన ఆతిథ్యం
- తరలివచ్చిన మహిళలు
- తీవ్ర ఎండతో ఇబ్బందులు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

చిత్రాడ దద్దరిల్లింది.. జన సందోహంతో గర్జించింది.. అంచనాలకు మించి తరలివచ్చిన జనంతో పోటెత్తింది.. ఆవిర్భావ సభ పండగను సంతరించుకుంది.. కనుచూపుమేరలో జనం..కళ్లు మిరిమిట్లు గొలిపేలా లైటింగ్.. వేలల్లో బారులు తీరిన బస్సులు.. కార్లు.. కనివినీ ఎరుగని ఏర్పాట్లతో నభూతో నభవిష్యత్తు అనే తరహాలో జయకేతనం సభ జయజయ ధ్వానాలతో దద్దరిల్లింది..అటు జనసేనాని పవన్‌కల్యాణ్ తన ప్రసంగంలో జనసైనికుల గురించే అధికంగా ప్రస్తావించి వారి మనసులు గెలుచుకున్నారు. పార్టీ నూరుశాతం స్ట్రైక్ రేట్ సాధించడంలో వారి పాత్ర ఎనలేనిదని కొనియాడి అందరి గుండెలను తట్టారు. ఇన్నేళ్లలో ఎందరో జనసైనికులు పార్టీ సిద్ధాంతాల కోసం చనిపోయిన వైనాన్ని గుర్తుచేసి వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. వెరసి జనసైనికులతోనే తన బంధం.. అనుబంధం అని వెల్లడించి పార్టీ క్యాడర్ తన దృష్టిలో ఎంత గొప్పస్థానం దక్కించుకున్నారో వివరించి అందరితో చప్పట్లు కొట్టించుకున్నారు. అటు చిత్రాడ సభ కనివినీ ఎరుగని రీతిలో సక్సెస్ అయింది. అంచనాలకు మించి జనం భారీగా తరలి రావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నానికే కిక్కిరిసింది. రాష్ట్రవ్యాప్తంగా దారులన్నీ చిత్రాడవైపే కదలడంతో కత్తిపూడి నుంచి కాకినాడ వరకు 216హైవే ఇసుకేస్తే రాలనంతగా మారిపోయింది.మహిళలు.యువత..రైతులు.. ఇలా అన్ని వర్గాలు సభకు హాజరవడం కన్నులపండువగా కనిపించింది. అటు పవన్ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు డిప్యూటీ సీఎంగాను,పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రిగా సాధించిన విజయాలను ప్రత్యేక వీడియో ద్వారా ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది.పవన్ కోసం జనం ఉదయం నుంచే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో మూడు ప్రవేశద్వారాలు కిక్కిరిసిపోయాయి. అటు పోలీసులేమో మధ్యాహ్నం 12గంటల నుంచే లోపలకు అనుమతించడంతో జనం ఆరుబయటే ఎండలో ఉండిపోయారు.ఆ తర్వాత మధ్యాహ్నం మూడు గంటలకే సభలోని అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. దీంతో వేలాది జనం బయటే ఉండిపోయారు. చాలా మంది వద్ద వీవీఐపీ, వలంటీర్ల పాసులు ఉన్నా పోలీసులు లోపలకు పంపకపోవడంతో చాలాసేపు వాగ్వాదం జరిగింది. అటు ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉండడంతో కొందరు మహిళలు సొమ్మసిల్లిపడిపోయారు. కానీ అంచనాలకు మించి తరలివచ్చిన జనం ఎక్కడా ఎండకు భయపడకుండా రాత్రి పదిన్నర వరకు సభలోనే ఉండిపోయారు.



విజయకేతనమే..



పవనే..మా నాయకుడు

4:30 గంటలకు పవన్..

పవన్‌కల్యాణ్ సరిగ్గా 4.30గంటలకు సభా ప్రాంగణానికి హెలికాప్టర్‌లో చేరుకున్నారు. అనంతరం సభా వేదిక పక్కనే ఉన్న ప్రత్యేక బసలోకి వెళ్లి తిరిగి స్టేజీ మీదకు రాత్రి 7.30 గంటలకు చేరుకున్నారు. ఈలోపు చాలాసేపు మంత్రి నాదెండ్లతో భేటీ అయ్యారు. అటు పవన్ వచ్చిన హెలికాప్టర్ సాయంత్రం ఐదుగంటలకు కాకినాడ వెళ్లింది. సభ ముగిసిన తర్వాత పవన్ కాకినాడలో జేఎన్టీయూ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. తిరిగి శనివారం ఉదయం పవన్ హెలికాప్టర్‌లో అమరావతికి బయలుదేరనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి సభలో జనసేన ఎంపీ ఉదయ శ్రీనివాస్, మంత్రి దుర్గేష్, పలువురు ఎమ్మెల్యేలు ప్రసంగించారు. పవన్ తన ప్రసంగంలో ఎక్కడా పిఠాపురం నియోజకవర్గం గురించి ప్రత్యేకంగా ప్రస్తావన తేలేదు.అనేక విస్తృత అంశాలపై అనర్గళంగా ప్రసంగించడంతో సభకు వచ్చిన వారంతా చప్పట్లతో పవన్‌ను అభినందించారు. పవన్ సైతం సభను సక్సెస్ చేయడానికి శ్రమించి, సహకరించిన కాకినాడ కలెక్టర్,ఎస్పీతోపాటు పోలీసులను అభినందించారు.సినిమాలనుంచి తన రాజకీయ ప్రస్థానం వరకు కూలంకషంగా చర్చించడం అభిమానులను అలరించింది. జనసేనకు అధికారం ఇవ్వడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతున్న విషయాన్ని వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రసంగం మధ్యలో పవన్ అని జనం అరుస్తుండడంతో.. కొంత అసహనం చెందిన పవన్ నా పేరు అరుస్తున్నారు.. అంటే.. నా ప్రసంగం వినడం లేదని అర్థం అని చురకలు అంటించడంతో జనసైనికులు ప్రసంగంపై దృష్టిసారించారు. జగన్‌లా తాను కోడికత్తి రాజకీయాలు చేయడం లేదని సైద్ధాంతిక రాజకీయాలు చేస్తున్నాని గుర్తుచేశారు.పదేళ్లలో పడ్డాం..నిలబడ్డాం అని పేర్కొని జనసేన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో యువ నాయకులను తయారు చేయడమే లక్ష్యంగా జనసేన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. సభ ముగిసిన తర్వాత జనం తిరిగి స్వస్థలాలకు తిరిగి వెళ్లే సమయంలో వారందరికీ భోజన వసతిని పార్టీ సమకూర్చింది.అంచనాలకు మించి వచ్చిన జనానికి ఎక్కడా భోజనాలకు ఇబ్బంది లేకుండా ఆతిథ్యం వహ్ వా అనేలా చేసింది. అటు రాష్ట్రస్థాయి సభ చిత్రాడలో జరుగుతుండడంతో ఊరి గురించి ప్రతి ఒక్కరూ ఆరా తీయడంతో గూగుల్‌లో ట్రెండింగ్‌గా మారింది. హోటళ్లు, రెస్టారెంట్లు భారీగా కిక్కిరిశాయి.





ఏ తరమైనా..అభిమానమే..



అభిమాన హోరు..



మా గురుతు.. పవన్..



అదిరే ఆతిథ్యం : కాకినాడ నుంచి చిత్రాడ వరకూ పలుచోట్ల ఆహార కేంద్రాలు ఏర్పాటు చేసి మధ్యాహ్నం.. సాయంత్రం కూడా బిర్యానీ.. భోజనాలు అందించారు.



జై..జై.. జనసేన

వేగం.. విషాదం!

తాడేపల్లిగూడెం హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు.. మృతుల స్వస్థలం మండపేట

7

రంజాన్ వేళలు	ఇఫ్తార్ (శని)	సా.6.21
	సహరి (ఆది)	ఉ.4.50

జిల్లా ఇన్‌చార్జి అధికారిగా రవిసుభాష్

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పర్యవేక్షణకు జిల్లాకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేయడం, పరిపాలనను బలోపేతం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, సత్వర సమస్యల పరిష్కారానికి మెరుగైన సేవలు అందించేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారులను జిల్లాలకు ఇన్‌చార్జిలుగా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా ఇన్‌చార్జితోపాటు జోనల్ ఇన్‌చార్జిలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవాట్రస్టు సీఈవో పి.రవిసుభాష్‌ను జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఐదు జిల్లాలకు ఒక జోనల్ ఇన్‌చార్జిగా అజయ్‌జైన్‌ను ప్రభుత్వం నియమించింది. జిల్లా ఇన్‌చార్జి అధికారి రవిసుభాష్ శనివారం కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యంగా వీరికి ప్రభుత్వం కొన్ని బాధ్యతలను అప్పగించింది. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో పాల్గొని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు సహాయకులుగా ఉండాలి. 15 రోజులకొకసారి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించాలి. గ్రామాల్లో పర్యటించి నెలలో రెండుసార్లు గ్రామాల్లో రాత్రి బస చేయాలి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షించి చర్యలు తీసుకోవాలి. నెలవారీ పురోగతి నివేదికను జోనల్ ఇన్‌చార్జికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించాలి. ప్రతీ నెల 1న పింఛన్ల పంపిణీ, ప్రతీ మూడో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పరిశీలించాలి. నెలకోసారి గ్రామాలను సందర్శించి బస చేయాలి. పారిశ్రామికవేత్తలు, రైతులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పన్ను చెల్లింపుదారులతో చర్చలు నిర్వహించాలి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అవాంతరాలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వం ఆ మార్గదర్శకాల్లో సూచించింది.



నేడు పర్యటన ఇలా..

కోనసీమ జిల్లాకు జిల్లా ఇన్‌చార్జి అధికారిగా నియమితులైన పి.రవిసుభాష్ శనివారం కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. మూడో శనివారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి 10.15 గంటలకు అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞలో పాల్గొంటారు. అక్కడి నుంచి 10.30 గంటలకు బయలుదేరి 10.40 గంటలకు అమలాపురంలోని రైతుబజార్‌లో జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తారు. 10.55 గంటలకు ముమ్మిడివరం మండలం అనాతవరం చేరుకుని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును సందర్శించి ప్రజలతో మాట్లాడతారు. అక్కడి నుంచి బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 11.50 గంటల నుంచి 1 గంట వరకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో గోదావరి భవన్‌లో సమావేశమవుతారు.

కన్న తండ్రే కాలయముడై..

- ఇద్దరు కుమారుల్ని క్రూరంగా చంపి ఆత్మహత్యకు పాల్పడిన నాన్న
- కుప్పకూలిన తల్లి
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు 7

కూతురి బాధ.. అప్పుల వ్యథ!

- తట్టుకోలేక గోదారిలో దూకేసిన దంపతులు
- మృతదేహాల గుర్తింపు 7



సభ వద్ద నాగబాబు భార్య



సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్



మేం సైతం : సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషేన

పవనుడు అందరివాడు..



పవన్ అభిమానం

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.

పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



చిత్రాడదారులన్నీ జనపవనమై..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



వీరమహిళల ఆనందోత్సాహం



మైక్ స్టాండ్‌లపైనా జనసైన్యం



జనసేన సభ ఎక్కడుంటే అక్కడే ఉంటా



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాములును సత్కరిస్తున్న పవన్‌కల్యాణ్



తిరుగు ప్రయాణంలో..



స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొడుతున్న జన సైనికులు

సభ విజయవంతం కావాలని 108 కొబ్బరికాయలు కొట్టారు!

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు వచ్చిన జన సైనికులు కొబ్బరికాయలు కొట్టారు. కోనసీమ ప్రాంతం నుంచి వచ్చిన ఈ జన సైనికులు సభ సమీపంలో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ స్వాగత ద్వారం వద్ద 108 కొబ్బరికాయలు కొట్టి జనసేన ఆవిర్భావ సభ విజయవంతంగా సాగాలని కోరుకున్నారు.



జనశ్రేణులకు ఎండదెబ్బ

పిఠాపురం/కలెక్టరేట్ (కాకినాడ) మార్చి 14(ఆంధ్రజ్యోతి): జన సైనికులను ఎండ తీవ్రత ఇబ్బందులకు గురిచేసింది. శుక్రవారం ఉదయం నుంచి ఎండతీవ్రత గణనీయంగా ఉంది. మధ్యాహ్నానికి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలుగా నమోదైంది. చిత్రాడ శివారులోని జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణానికి మధ్యాహ్నం 12 గంటలకే చేరుకున్న వారికి ఎండతీవ్రత చుక్కలు చూపించింది. సభా ప్రాంగణంలోకి వచ్చిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఎండ నుంచి కాపాడుకునేందుకు అట్టలు, పేపర్లు అడ్డుగా ఉంచుకున్నారు. పలువురు ఫ్లెక్సీలను నెత్తిన పెట్టుకుని ఎండ తీవ్రత నుంచి కాపాడుకునే ప్రయత్నం చేశారు. చెట్ల కింద కూర్చుని ఉపశమనం పొందారు. సాయంత్రం వరకూ ఇదే రీతిలో ఉష్ణోగ్రతలు కొనసాగాయి. దీంతో సభకు వచ్చినవారు తాగునీరు,మజ్జిగ తాగుతూ తీవ్రత తగ్గించుకునే ప్రయత్నం చేశారు.



అస్వస్థతకు గురైన వలంటీర్ కె.దుర్గాలక్ష్మి

పదిమందికి పైగా అస్వస్థత

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభలో అపశృతి చోటు చేసుకుంది. సభకు వచ్చిన పలువురు ఎండతీవ్రత, ఉక్కపోత భరించలేక అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన ఉక్కపోత ఉండడంతో ఒకరిద్దరు స్పృహ కోల్పోయారు. సభలో వలంటీర్‌గా పనిచేసేందుకు వచ్చిన తెనాలికి చెందిన కె.దుర్గాలక్ష్మి, బందోబస్తు విధుల నిమిత్తం వచ్చిన రాజమహేంద్రవరం కానిస్టేబుల్ కె.దేవి, సత్యవతి, ఎం.రాధాకృష్ణ సహా పదిమంది అస్వస్థతకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రి, ప్రైవేటు ఆస్పత్రులకు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు.

ముఖ్య నేతలు ఎవరేమన్నారంటే...

- కలెక్టరేట్ (కాకినాడ)

విప్పటం సభలో వేటకు వెళుతున్న సింహంలా..

విప్పటంలో జరిగిన సభలో వేటకు వెళుతున్న సింహంలా పవన్‌కల్యాణ్ కన్పించారు. ఈ 12వ ఆవిర్భావ సభకు వస్తుంటే గుంటనక్కలను వేటాడి వచ్చిన సింహంలా పవన్ కనిపిస్తున్నారు. పవన్‌కల్యాణ్ కృషి వల్లే ఈరోజు రాష్ట్రంలో జలజీవన్ మిషన్ కింద నిధులు విడుదల అవుతున్నాయి. గత పాలకులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన జలజీవన్ మిషన్ నిధులు నిర్వీర్యం చేశారు. - కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

మోదీ అంత క్రేజ్ పవన్‌ది..

2019 సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఓడిపోయినా ఢీలా పడలేదు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికల్లో 100 శాతం స్ట్రైకరేట్‌తో విజయం సాధించాం. దేశంలో నరేంద్రమోదీ తర్వాత అంతటి క్రేజ్ పవన్‌కు ఉంది.

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సొంత డబ్బు కౌలు రైతులకు ఇచ్చారు

పవన్ సొంత డబ్బు పంపిణీ చేసి కౌలు రైతులను ఎంతో ఆదుకున్నారు. జనవాణిలో వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించి వారి మనస్సులో నిలుస్తున్నారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడడానికి పవన్ ఎంతో శ్రమించారు. మత్స్యకారులకు నష్టం కలిగించే జీవో రద్దు చేశారు.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు నష్టం కల్గించే 217 జీవోను పవన్‌కల్యాణ్ రద్దు చేయించారు. ఎన్నికల్లో మత్స్యకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు.

- నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

గిరిజనుల అభివృద్ధికి కోసం కృషి

అప్పట్లో బ్రిటీష్ వాళ్లకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు ఎన్నో పోరాటాలు చేశారు. ఇప్పుడు గిరిజనుల అభివృద్ధి కోసం పవన్‌కల్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారు. మన్యం జిల్లాలో రోడ్ల అభివృద్ధికి పవన్ కృషి చేస్తున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

- పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

గత ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం

గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు భరించాం. అయినప్పటికీ అధైర్యపడకుండా పనిచేసి పవన్ సారథ్యంలో విజయం సాధించాం. మన కర్తవ్యం స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే.

- నెల్లిమర్ల ఎమ్మెల్యే మాధవి

పవన్‌కల్యాణ్ కారణజన్ముడు

పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కారణజన్ముడు. అందుకే తను పుట్టినప్పుడు తన మాతృమూర్తికి నొప్పులు లేవు. పవన్ స్వార్థం లేకుండా రాజకీయాలు చేశారు. ఆదాయం వచ్చే సినిమాలు వదిలేసి ప్రజల కోసం పోరాటాలు చేసి ప్రజల కోసమే అధికారంలోకి వచ్చారు.

- అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

పవన్ పోరాటంతోనే ఎన్నికల్లో నెగ్గాం

కేవలం ఒక వ్యక్తి పవన్ పోరాటంతోనే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ నెగ్గాం. పవన్ కల్యాణ్ పోరాటాల వల్ల అధికారంలోకి వచ్చాం. తొమ్మిది నెలల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాం.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా

తాను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకానని అనగానే సభలో నవ్వులు విరిశాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆదర్శంతో జనసేన పార్టీ ఆవిర్భవించింది. వందేళ్ల క్రితం అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ దొరలను గడగడలాడించారు. మరలా ఇప్పుడు పవన్ వైసీపీ నియంతలను గడగడలాడించారు. జగన్‌రెడ్డి మీకు ఇంకా జనసేన ఎందుకు పుట్టిందో అర్థంకాలేదా అని ప్రశ్నించారు.

- యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

పవన్‌తోనే సాధ్యం

పవన్ సారధ్యంతోనే జనసేన అఖండ విజయం సాధించింది. గత ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశాం. చివరకు కూటమిగా జతకట్టి విజయం సాధించాం. పేదలకు సేవ చేయడానికే పవన్ పార్టీ పెట్టారు.

- రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

జగన్ తెలుగుకు ఎక్కువ.. ఇంగ్లీషుకు తక్కువ

వైసీపీ నేత జగన్ తెలుగుకు ఎక్కువ, ఇంగ్లీషుకు తక్కువ. పవన్‌కల్యాణ్‌కు నాలుగైదు భాషలు మాట్లాడతారు. జగన్‌కు కనీసం తెలుగు, ఇంగ్లీషులో కూడా పరిజ్ఞానం లేదు. జగన్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యల వల్లే ఆ పార్టీ కేవలం 11 సీట్లుకే పరిమితం అయ్యింది. - మచిలీపట్నం ఎంపీ బాలశౌరి

భవిష్యత్తులో వైసీపీ కనుమరుగు

గత 11 ఏళ్ల పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఆవిర్భావ సభలు జరుపుకున్నాం. ఇప్పుడు పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు అభిమానుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో వైసీపీ కనుమరుగవడం ఖాయం.

- కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి

అడుగులన్నీ అటువైపే..

ఆవిర్భావ వేడుకకు తరలివచ్చిన జనసైన్యం

కాకినాడ- పిఠాపురం రహదారిపై భారీ జనసందోహం.. జనసైన్యాన్ని అదుపు చేయలేక పోలీసుల కష్టాలు

పిఠాపురం/ కాకినాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అన్నిదారులు ఆవిర్భావ సభ వైపే. చిత్రాడకు వచ్చే మార్గాలన్నీ జనసంద్రమయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ 216వ జాతీయ రహదారితోపాటు అన్ని రోడ్లు ప్రజలు, వాహనాలతో కిక్కిరిసిపోయాయి. పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3 గంటలకే నిండిపోవడంతో ఎక్కడిక్కడ రహదారుల వెంబడి వాహనాలు నిలిపివేశారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సభ ముగిసిన తర్వాత ఇదే పరిస్థితి నెలకొంది. ఎన్‌హెచ్‌తోపాటు పిఠాపురం-సామర్లకోట, ఉప్పాడ-పిఠాపురం, విరవాడ-కోలంక-పిఠాపురం, గోర్స-పిఠాపురం, తిమ్మాపురం-పిఠాపురం, చంద్రపాలెం-చిత్రాడ, నాగులాపల్లి-మాధవపురం-పిఠాపురం సహా అన్ని రోడ్లు వాహనాలతో కిక్కిరిసి కనిపించాయి. చిత్రాడ సభా ప్రాంగణానికి సమీపంలో కాకినాడ వైపు ఏర్పాటు చేసిన అయిదు, పిఠాపురం వైపు ఏర్పాటుచేసిన నాలుగు పార్కింగ్ ప్రదేశాలు మధ్యాహ్నం 3గంటలకే నిండిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు, కార్లు, వేన్‌లు, ఇతర వాహనాలకు నిలిపే చోట్లు లేకపోవడంతో జాతీయరహదారి, చిత్రాడ పరిసర ప్రాంతాల్లోని రోడ్లపై నిలిపివేశారు. ట్రాఫిక్ సైతం కిలోమీటర్ల మేర నిలిచిపోయింది.



జ్యోతి ప్రజ్వలన

మామిడికుదురులో
ఓఎన్జీసీ పైపులైను లీకేజీ



లీకవుతున్న గ్యాస్ పైపులైను

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడి ఓఎన్జీసీ స్ట్రక్చర్‌లో గల పైపులైను మామిడికుదురులో గురువారం స్వల్పంగా లీకైంది. గ్రామంలోని ఏటిగట్టు శివారు ప్రాంతంలో గల వరి చేలలో లీకేజీ ఏర్పడింది. పాశర్లపూడి 43 బావి నుంచి నగరం జీసీఎస్ వరకు ఏర్పాటుచేసిన పైపులైను నుంచి లీకేజీ ఏర్పడినట్టు సంబంధిత అధికారులు గుర్తించారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో తెల్ల నురగతో పాటు ముడిచమురు తెట్టుగా రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో ముడిచమురు వాసన వ్యాపించడంతో స్థానికులు ఆందోళన చేస్తున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో రెండు పర్యాయాలు లీకేజీ సంభవించిందని అధికారులు తూతూ మంత్రంగా లీకేజీ అరికట్టి చేతులు దులుపుకుంటున్నారని సంబంధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో లీకేజీ కాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులతో పాటు రైతులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గర్భిణి మృతి



ధనకుమారి (ఫైల్)

ముమ్మిడివరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కర్రివానిరేవు పంచాయతీ చింతావానిరేవులో శుక్రవారం ఓ మహిళ విద్యుదాఘాతంతో మృతిచెందింది. చింతావానిరేవుకు చెందిన రేకాడి ధనకుమారి (25) వాటర్ హీటర్‌ను స్విచ్ బోర్డులో పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త రేకాడి కనకరాజు కర్రివానిరేవు గ్రామ పంచాయతీ పరిధి 10వ వార్డు సభ్యుడు. ఒక కుమార్తె ఉండగా ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. ధనకుమారి భర్త కనకరాజు చేపలవేట వృత్తి చేసుకుంటున్నాడు. ధనకుమారి మృతితో ఆకుటుంబంలో విషాదం నెలకొంది.

ఇద్దరు నకిలీ విలేకర్లపై కేసు

మండపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): విలేకర్ల ముసుగులో బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడిన ఇద్దరిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ దారం సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... అనపర్తి మండలం మహేంద్రవాడకు చెందిన చంద్రమళ్ల రవీంద్ర కోళ్లపెంటను వాహనంలో తీసుకువెళుతుండగా మండపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చేసరికి తాము విలేకర్లమంటూ మండపేటకు చెందిన పెనుముచ్చి సుకుమార్, రాయవరం మండలానికి చెందిన పెంకే వంశీ వ్యాన్‌ను ఆపారు. లారీ రికార్డును తీసుకురావాలని కోరారు. వ్యాన్ కదలాలంటే తమకు రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు ఇచ్చేందుకు రవీంద్ర నసేమి రా అననంతో స్టేషన్‌కు పదాఅంటూ వ్యాన్‌ను మండపేట పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. స్టేషన్‌కు వచ్చిన తర్వాత జరిగిన సంఘటన అంతా డ్రైవర్ రవీంద్ర పట్టణ సీఐ సురేష్‌కు వివరించారు. దానిపై సీఐ నకిలీ విలేకర్లను వాహనం ఎందుకు ఆపారు అంటూ ప్రశ్నించారు. దానికి వారు నీళ్ల నమిలారు. డ్రైవర్ ఫిర్యాదుపై సుకుమార్, వంశీలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎవరైనా విలేకర్ల ముసుగులో నకిలీ దందాలు చేస్తే ఫిర్యాదు చేయాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

శాస్త్రోక్తంగా
నారసింహుని చక్రస్నానం



స్వామివారి అద్దపు సేవ దృశ్యం

- కోరుకొండలో ప్రత్యేక పూజలు
- పోటెత్తిన భక్తులు



చక్రస్నానం దృశ్యం

కోరుకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కోనేరు వద్ద చక్రస్నానం ఆగమ పండితులు, అర్చక స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, కోరుకొండ దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజ భట్టర్ స్వామి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దిగువ దేవస్థానం వద్ద స్వామికి సేవాకాలం నిర్వహించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామివారిని, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని వేర్వేరు పల్లకీలలో ఆశీనులు గావి ంచారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల మధ్య పల్లకీలు దిగువ దేవస్థానం నుంచి గిరి ప్రదక్షిణగా దేవుని కోనేరు వద్దకు చేరుకున్నాయి. అక్కడ శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు, శ్రీభూ సమేత అనంత పద్మనాభస్వామి వారి సమక్షంలో ఆగమ బ్రహ్మపాణింగపల్లి పవన్ కుమార్ ఆచార్య లు, అనువంశక అర్చక స్వాములు పెదపాటి గిరిధరాచార్యులు, సంతోషకుమార్ ఆచార్యులు ఈ చక్ర పెరుమాళ్ళకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అంతకుముందు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి శ్రీ చక్రపెరుమాళ్ళకు పంచామృత అభిషేకాలు చేసి దేవుని కోనేటిలో చక్రస్నానం చేయించారు. అనేక మంది పండితులు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు వందలాది మంది భక్తులు, స్వామివారితో కలిసి దేవుని కోనేటి చక్రస్నానం చేశారు. అనంతరం స్వామి వారికి అర్చన, సేవాకాలం, తీర్థగోష్ఠి జరిగింది. తదుపరి భక్తుల గోవిందనామస్మరణ మధ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామివారు అనంతపద్మనాభ స్వామి వారు శ్రీచక్రపెరుమాళ్ళతో దేవాలయానికి చేరుకున్నారు.

శేషవాహనంపై గ్రామోత్సవం

అలాగే విశేష పుష్ప అలంకరణలతో స్వామి,అమ్మవార్లను శేషవాహనంపై ఆశీనులైరాత్రి 9గంటలకు గ్రామోత్సవం చేశా రు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ స్వామివారి శేషవాహనాన్ని కోరుకొండ నాలుగు మాడవీధుల్లో తిప్పారు. ఆ వాహనం తమ ఇళ్ల ముందుకు వచ్చినప్పుడు భక్తులు స్వామివారికి ఫలాలు, పుష్పాలు మంగళనీరాజనాలు అందజేశారు. ఉత్సవాలు ముగింపు రోజు చివరి రోజు శేషవాహనాన్ని తిలకించి పులకించారు.

ముగిసిన పండిత సభలు

శ్రీ రంగరాజ స్వామి వారి ఆలయ సన్నిధిలో గత 5 రోజులుగా సాగుతున్న 93వ విశిష్టాద్వైత పండిత సభలు శుక్రవారం రాత్రి 8గంటలతో వైభవంగా ముగిశాయి. సభా అధ్యక్షులు పరా సర లక్ష్మీనరసింహ భట్టర్ ఆధ్వర్యంలో ఉభయ వేదాంత పండితులు సాతులూరి వెంకట శ్రీనివాస్ కల్యాణ చక్రవర్తి, మార్గపూరి రంగాచార్య స్వాములు ఉపన్యసించారు. అనేక భగవద్ విషయాలను భక్తులకు వివరించారు. అదే విధంగా నరసింహస్వామివారి అనువంశకధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్ స్వామి, రఘునాథ భట్టర్ స్వామి, మహిళా పండితులు ఉభయ వేదాంత పండిత సభల్లో పలు విషయాలను వివరించారు. పరాసర లక్ష్మీనరసింహభట్టర్ ఆధ్వర్యంలో పండితులకు సత్కారం జరిగింది.



పండిత సభలో పాల్గొన్న లక్ష్మీ నరసింహభట్టర్, పండితులు

వైభవంగా అద్దపు సేవ

నరసింహస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం పౌర్ణమి పర్వదినం సందర్భంగా స్వామి వారి కల్యాణ వేదికపై స్వామివారికి విశేష ఫలపుష్ప అలంకరణల మధ్య అద్దపు సేవ అనబడే ఊంజలసేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఊయలలో ఆశీనులు గావించి ఈ సేవ చేపట్టారు. స్వామికి ఎదురుగా ఉన్న పెద్ద అద్దంలో వేలాదిమంది భక్తులు అద్దంలో దర్శించుకున్నారు. అంతకుముందు ధ్వజ అవరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరాసర లక్ష్మీనరసింహభట్టర్, రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటిండెంట్ వాసు, రాంజీ, నాగరాజు, ఇతర అధికారులు, పెద్దింటి చంటిబాబు ఆచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, పెదపాటి గిరిధరాచార్యులు, గోవర్ధనం తిరుమలాచార్యులు, పెరవళి వంశీఆచార్యులు, గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ వీరగణేష్, బీజేపీ ఇన్‌చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పూజలు



అన్నవరంలో జస్టిస్ శ్రవణ్‌కుమార్‌కు సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న పీఆర్వో

అన్నవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

భీమేశ్వరాలయంలో...

ద్రాక్షారామ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం వారికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు.

నేడు ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య, బడ్జెట్ సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ, బడ్జెట్ సమావేశాలు శనివారం జరగనున్నాయి. కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, మూడు జిల్లాల అధికారులు పాల్గొంటారు.

కన్న తండ్రే కాలయముడై..

ఇద్దరు కుమారుల్ని క్రూరంగా చంపి ఆపై ఆత్మహత్యకు పాల్పడిన నాన్న

- కుప్పకూలిన తల్లి
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హోలీ రోజున కాకినాడలో దారుణం



ఫ్యానుకి ఉరేసుకున్న చంద్రకిషోర్



ఫైల్ ఫొటో

సర్పవరం జంక్షన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా హోలీ వేడుకల్లో ఆనందోత్సాహాల్లో మునిగి ఉన్నారు. ఇద్దరూ చిన్నారులు కూడా హోలీ పండుగలో తల్లిదండ్రులతో కలిసి పాల్గొనేందుకు వెళ్తున్నామని సంబరపడ్డారు. కానీ ఇదే తమకు ఆఖరి పండుగ అనే విషయం ఆ చిన్నారులకు తెలియదు. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్న తండ్రే కాలయముడిలా మారి ఇద్దరిని అతి పాశవికంగా కాళ్లుచేతులు కట్టేసి నీళ్ల బకెట్టులో ముంచి, ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం తానూ కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోటీ ప్రపంచంలో తన పిల్లలకు భవిష్యత్తు లేదని, అందుకే తన పిల్లల్ని చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సూసైడ్ నోటు రాసి మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకెళితే తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి చంద్రకిషోర్ (37) భార్య తనూజాతో కలసి కాకినాడ అర్బన్ 2వ డివిజన్ తోట సుబ్బారావునగర్ రోడ్డు నెంబర్ -2, రామానాయపేట భూదేవి అపార్టుమెంట్‌లో ప్లాట్ నెంబర్ 202లో తొమ్మిదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. కాకినాడ రూరల్ వాకలపూడి ఓఎన్‌జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వారికి ఇద్దరు సంతానం కాగా, వారిలో పెద్ద కుమారుడు వానపల్లి జోషిల్ (7), రెండో కుమారుడు నిఖిల్ (6)లు లిటిల్ ఉడ్స్ స్కూల్లో ఒకటో తరగతి, ఎల్‌కేజీ చదువుతున్నారు. శుక్రవారం ఉదయం ఓఎన్‌జీసీ కార్యాలయంలో హోలీ వేడుకలు చేసుకునేందుకు భార్య, ఇద్దరు పిల్లలతో కలసి వెళ్లాడు. అక్కడకు వెళ్లిన 10 నిమిషాలు అయిన తర్వాత కుమారులు ఇద్దరికీ యూనిఫామ్ కుట్టించేందుకు టైలర్ వద్దకు తీసుకువెళుతున్నానని చంద్ర కిషోర్ భార్యకు చెప్పి కుమారుల్ని వెంట తీసుకుని వెళ్లాడు.

పది నిమిషాల్లో వస్తానని చెప్పి...

పది నిమిషాల్లో వస్తానని చెప్పి వెళ్లిన భర్త ఎంతకీ రాకపోవడంతో భర్తకు ఫోన్ చేయగా 10 నిమిషాల్లో వచ్చేస్తానని భార్యకు చంద్రకిషోర్ బదులిచ్చాడు. ఎంతకీ భర్త ఇద్దరు పిల్లలతో రాకపోవడంతో కంగారు పడి భర్త ఆఫీసులో పని చేస్తున్న రామమూర్తిని ఇంటికి వెళ్లి చూసి రావాలని పంపించింది. అతడు వెళ్లగా ప్లాట్ డోర్లు లోపల నుంచి వేసి ఉండటంతో పలు సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి బలవంతంగా కిటికీ గ్రిల్ ఓపెన్ చేసి లోపలికి వెళ్లి చూశాడు. చంద్రకిషోర్ బెడ్‌రూమ్‌లో ఫ్యానుకు ఉరేసుకోవడంతో విగతజీవిగా ఉండటాన్ని చూశాడు. పిల్లలు పక్కనే ఉన్న మరో బెడ్‌రూమ్‌లోని అటాచ్డ్ బాత్‌రూమ్‌లో పిల్లల చేతులు, కాళ్లు కట్టి వేసి, తలలను నీటితో నిండిన బకెట్లలో ముంచడంతో చనిపోయి ఉండటాన్ని పరిశీలించి చంద్రకిషోర్ భార్య, పోలీసులకు సమాచారం అందించాడు.

పోటీ ప్రపంచంలో భవిష్యత్తు లేదని...

అయితే చంద్రకిషోర్ సూసైడ్ నోట్ రాసి ఉంచాడు. దీనిని పోలీసులు, భార్య వచ్చి పరిశీలించగా తన పిల్లలకు పోటీ ప్రపంచంలో భవిష్యత్తు లేదని, అందుకే వారిని చంపి తానూ మరణిస్తున్నట్టు ఆ నోట్‌లో ఉంది. పిల్లల్ని క్రూరంగా చంపి భర్త కూడా ఆత్మహత్య చేసుకోవడాన్ని చూసిన భార్య కుప్పకూలిపోయింది. పిల్లలపై పడి కన్నీరుమున్నీరుగా విలపించింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పిల్లల్ని ఇలా ఎందుకు చంపేశావు అంటూ రోధించింది. ఆర్థిక ఇబ్బందులు ఏమీలేవని సొంత ప్లాటు, కారు, ఆస్తులు ఉన్నాయని మృతుడి అన్నయ్య తెలిపారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామని, సూసైడ్ నోట్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వేగం.. విషాదం!

తాడేపల్లిగూడెం హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
కుమార్తె సహా తల్లిదండ్రుల దుర్మరణం.. మరొకరికి గాయాలు

తాడేపల్లిగూడెం రూరల్/మండపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన చిన్నారి సహా తల్లిదండ్రులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన బోగిళ్ల పాపారావు రెండో కుమారుడు వెంకట సత్య సురేన్ (39) హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అతడి భార్య నవ్య(36), కుమార్తె వాసవీ కృష్ణ(4), వారి బంధువు ఉప్పులూరి శ్రీరమ్యతో కలిసి కారులో మండపేట బయలుదేరారు. కుంచనపల్లి వచ్చేసరికి హైవే పనులు చేసేందుకు నిలుపుదల చేసిన లారీని కారు వేగంగా వచ్చి ఢీకొని తునాతునకలైంది. డ్రైవ్ చేస్తున్న సురైన్, నవ్య ఘటనా స్థలంలో మృతిచెందగా చిన్నారి వాసవి కృష్ణని తణుకు లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ చనిపోయింది. శ్రీరమ్య కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రమేష్ తెలిపారు.



మరణించిన కుటుంబసభ్యుల ఫైల్‌ఫొటో

మండపేటలో విషాదఛాయలు

సురేన్ కుటుంబ సభ్యులు ముగ్గురు దుర్మరణం పాలవడంతో ఆయన స్వస్థలమైన మండపేటలో విషాదఛాయలు అలుముకు న్నాయి. ఆయన రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఎంబీఏ చేశాడు. చాలాకాలం క్రితం హైదరాబాద్ వెళ్లి ప్రైవేటు జాబ్ చేసుకుంటూ అక్కడే కుటుంబంతో ఉంటున్నాడు. అతడి భార్య నవ్య కె.గంగవరం మండలం యండగండి వాసి. వారి కుమార్తె వాసవితో కలిసి కారులో బయలుదేరి శనివారం మండపేటలో బంధువుల ఇంట జరిగే శుభ కార్యక్రమానికి, ఏడిదలో శివాలయంలో విగ్రహాల ప్రతిష్ఠకు హాజరయ్యేందుకు వస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు చనిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. క్షేమంగా ఇంటికి చేరతారన్న సమయంలో ఈ దుర్ఘటన జరగడంతో జీర్ణించుకోలేకపోతున్నారు.

పొగాకు బ్యారన్‌లో అగ్నిప్రమాదం

రూ.8 లక్షల ఆస్తినష్టం



యాదవోలులో మంటలను ఆర్పుతున్న ఫైర్ అధికారులు

దేవరపల్లి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదవోలులో పొగాకు బ్యారన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగింది. యాదవోలుకు చెందిన వలవల సత్యవతి బ్యారన్లను అదే గ్రామానికి చెందిన ముమ్మిడి శ్రీనివాస్ అద్దెకు తీసుకుని పొగాకు క్యూరింగ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పొగాకు క్యూ రింగ్ చేస్తుండగా ఆకులు బీడింగ్ గొట్టంపై పడడంతో మంటలు వ్యాపించి కలప పూర్తిగా దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు రైతులు, ఫైర్ అధికారులు గుర్తించారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం



సీతాపురంలో కాలిపోతున్న ఇల్లు

ఎటపాక, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం సీతాపురం గ్రామంలో శక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. సీతాపురం గొల్లగూడెం రోడ్‌లోని కాటూరి వెంకట నర్సమ్మకు చెందిన తాటాకింటికి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయి. కొద్దిసేపటికీ ఇళ్లు మొత్తం దగ్ధమై గృహోపకరణాలు కాలిబుడిదయ్యాయి. నర్సమ్మ ఇంట్లోనే కొడుకు కాటూరి వెంకటేశ్వర్లు కుటుంబం కూడా కలిసి జీవిస్తున్నారు. 2 కుటుంబాలకు చెందిన సామగ్రి కాలిపోయింది. పక్కనే ఉన్న దారా దుర్గాప్రసాద్ చెందిన రేకుల ఇళ్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంటి ఆవరణలో ఉన్న అతడి ద్విచక్ర వాహనం కూడా మంటల్లో చిక్కుకుంది. సుమారు రూ.6లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. ఫైరింజన్ అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది.

ప్రపంచ సాంకేతిక రంగంలో
భారతదేశం ముందంజ

జేఎన్టీయూకే రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సాంకేతిక రంగంలో భారతదేశం ముందంజలో ఉందని జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ అన్నారు. వర్శిటీలోని యూసీఈకే ప్రిన్సిపాల్ కార్యాలయ సెమినార్ హాల్లో ఐఐఐపీటీ డైరెక్టరేట్, ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో కోయంబత్తూరులోని జీకర్స్ ఎంప్లాయిమెంట్ కంపెనీ సహకారంతో రోబోటిక్ అప్లికేషన్ల కోసం కస్టమ్ ఎంబెడెడ్ బోర్డును అభివృద్ధి చేయడం అంశంపై జాతీయ స్థాయి ఎస్పార్క్స్-2025 టెక్నికల్ సింపోజియంలో భాగంగా శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. 3రోజులు తరగతులు జరుగుతాయి. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్, గౌరవ అతిథిగా ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం ఆదరణలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్‌లెర్నింగ్, ఐఓటీ, డేటాసైన్స్, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డైరెక్టర్ బీటీ కృష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న తరగతులకు బి.లీలాకుమారి కన్వీనర్‌గాను, పి.పుష్పలత సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. అధ్యాపకులు, అను బంధ కళాశాలల విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు.

కూతురి బాధ..అప్పుల వ్యథ!

- తట్టుకోలేక గోదారిలో దూకేసిన దంపతులు
- మృతదేహాల గుర్తింపు





వెంకటరమణ, వరలక్ష్మి మృతదేహాలు

రాజమహేంద్రవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక కాకినాడకు చెందిన దంపతులు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తూరంగికి చెందిన కాళ్ల వెంకటరమణ(55) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడి భార్య వరలక్ష్మి(50) చీటీలు వేస్తారు. చాలా కాలంగా నమ్మకంగా ఉంటున్నారు. దీంతో స్థానికులు కూడా ఎంతో నమ్మారు. ఈ క్రమంలో దాదాపు రూ.60 లక్షల వరకూ అప్పులు చేశారు. తమ సొంతింటిని విక్ర యించి రూ.45లక్షల వరకూ అప్పులు తీర్చారు. ఇదిలా ఉండగా ఆరు నెలల కిందట ఒక్కగానొక్క కూతురు ప్రేమ వివాహం చేసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయింది. ఒక వైపు కూతురి బాధ..మరో వైపు అప్పుల వాళ్లు పీడించడంతో మానసికంగా నలిగిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో రాజమహేంద్రవరం పిండాల రేవుకు వచ్చి కూతురిని తలచుకుని బాగా రోధించారు. తర్వాత ఇద్దరూ గోదావరిలోకి దూకి ప్రాణాలు విడిచారు. తాము ఆర్థిక ఇబ్బందులతో చచ్చి పోతున్నామంటూ గోదా వరి గట్టుపై ఓ లెటర్‌ను ఉంచారు. తమ ఆధార్ కార్డులను కూడా అక్కడే పెట్టారు. స్థానికుల సమాచారం తో టూటౌన్ సీఐ మంగాదేవి ఆదేశాల మేరకు సిబ్బంది చేరుకుని గాలింపు చేపట్టారు. కొద్ది సమయంలో మృతదేహాలను గుర్తించారు. ఆధార్ కార్డుల ఆధారంతో వారి చిరునామా తెలుసుకుని బంధువులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో శవ పరీక్షల అనంతరం మృతదేహాలను సంబంధీకులకు అప్పగించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ మంగాదేవి పేర్కొన్నారు.

ఇసుకలోడుతో లారీ వెళ్తుండగా కూలిన వంతెన

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరంలోని వంతెనపై నుంచి ఇసుకలోడుతో లారీ వెళ్తున్న సమయంలో వంతెన కూలిపోయింది. వంతెన కూలడంతో ఇసుకలోడు లారీ కాల్వలోకి దిగబడిపోయింది. లారీ దిగబడిపోయినప్పటికీ ఎవరికీ ఏవిధమైన ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన పంటకాల్వపై ఉన్న ఈ వంతెన శిథిలస్థితికి చేరడంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు పేర్కొంటున్నారు. శిథిలమైన వంతెన గురించి చాలాకాలంగా స్థానికులు భయపడుతున్నారు. శుక్రవారం ప్రమాదం జరిగి ఏవిధమైన ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.





వైభవంగా చండీహోమం

ఐ.పోలవరం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతిపూజ, మండపారాధన, చండీహోమం, పూర్ణాహుతి జరిగాయి. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పీచు ఫ్యాక్టరీ దగ్ధం: రూ.8లక్షల నష్టం

మలికిపురం,మార్చి14(ఆంధ్రజ్యోతి): గొల్లపాలెంలో ఓఎన్జీసీ జీజీఎస్ సమీపంలోని అడబాల బాబు, మంచిగంటి చంటిలకు చెందిన రెండు పీచు ఫ్యాక్టరీలు దగ్ధమయ్యాయి. ఓఎన్జీసీకి చెందిన ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తెచ్చారు. ఓఎన్జీసీ జీసీఎస్ పక్కనే ప్రమాదం జరగడం, అధికారులు స్పందించడంతో పెద్దప్రమాదం తప్పింది.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



జనసేన ఆవిర్భావ దినోత్సవం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాగసతీష్ తదితరులు

అమలాపురం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ వేడుకలను శుక్రవారం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమలాపురం జనసేన పార్టీ కార్యాలయం వద్ద సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యాళ్ల నాగసతీష్, సీనియర్ నాయకులు కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోటూరి వెంకటేశ్వరరావు, పడాల శ్రీదేవి, డీఎంఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ సభకు అమలాపురం పట్టణ పరిసర గ్రామాల నుంచి ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సులు, కార్ల సముదాయాలను సీనియర్ నాయకుడు నల్లా శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కల్వకొలను తాతాజీ, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఏర్పాటుచేసి.. ఐఆర్ మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సాయివరప్రసాద్

అమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను తక్షణం పరిష్కరించడంతో పాటు 12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఎం.సాయివరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పటి వరకు మధ్యంతర భృతిని మంజూరు చేయాలని కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సాయివరప్రసాద్ అధ్యక్షతన నెలవారీ సమావేశం నిర్వహించారు. తొలుత రాష్ట్ర కార్యదర్శి ఎంవీఎస్ఎస్ సీహెచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఏడాది మొదటి రెండు నెలల్లో దాదాపు 400 మందికి డీఎల్సీలు అందించడం జరిగిందన్నారు. కదలలేని పరిస్థితుల్లో ఉన్న సీనియర్ పెన్షనర్స్ ఇళ్లకు వెళ్లి 50మందికి లైఫ్ సర్టిఫికెట్లు చేయించామని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు కార్యదర్శి నివేదికను, కోశాధికారి జయంతి సోమేశ్వరశర్మ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. అసోసియేషన్ సలహాదారు ఎస్.జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్ను విధివిధానాలు, పెన్షనర్ల సమస్యలను సమాధానాల రూపంలో సభ ముందుంచారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని రూ.5లక్షలకు పెంచాలని, కేంద్ర ప్రభుత్వం డీఏ, డీఆర్ ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను తక్షణం విడుదల చేయాలన్నారు. సమావేశంలో పలు తీర్మాణాలను ఆమోదించారు. టీవీ శర్మ, పి.అర్జునుడు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, మండలీక ఆదినారాయణ, జి.భీమరాజు, మహబూత్ షాహీరా పాల్గొని మాట్లాడారు.

రంజాన్ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు



మామిడికుదురులోని మసీదులో రంజాన్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంజాన్ నెలలో శుక్రవారానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంటుంది. నెలలో రెండో శుక్రవారం పురస్కరించుకుని భక్తులు మామిడికుదురులోని సున్నీ, షియా జామియా మసీదుల్లో ప్రత్యేక నమాజులు చేశారు. మత ప్రబోధకుడు సాధిక్ అన్వర్ రజ్వీ, షబ్బర్ అలీజైదీలు రంజాన్‌లో శుక్రవారం ప్రాముఖ్యతను వివరించారు. అధిక సంఖ్యలో ముస్లిం భక్తులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ నెలలో రెండో శుక్రవారం రాజోలు జామియా మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజులు నిర్వహించారు. జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ముస్లింలు తెల్లవారుజాము నుంచి ఉపవాస దీక్షలుచేసి సాయంత్రం ఇఫ్తార్ విందు స్వీకరించారు. మత గురువులు రంజాన్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మున్నా, బాజీ, వలీ, ఇబ్రహీం, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్,ముస్లింలు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్, (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌మాసం శుక్రవారం రోజున అమలాపురం మొల్లా ముస్తఫా మసీదులో ఇమామ్ మొహమ్మద్ రజా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహమ్మద్ అమీర్, మొహమ్మద్ ఆజామ్, మొహమ్మద్ బషీర్, ఎంఎంకేజీ మొహిద్దీన్, జీఎం ఖాన్, ఆలీ, వలీ, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక పరిశీలన



యానాం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): యానాం కురసాంపేట పరిధిలో ఉన్న హిందు శ్మశానవాటిక అధ్వానంగా ఉందని పలువురు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం శ్మశానవాటికను అధికారులతో కలిసి మల్లాడి పరిశీలించారు. అక్కడ చేయాల్సిన పనులు తదితర అంశాలపై అధికారులతో మల్లాడి చర్చించారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

జనసేన ఆవిర్భావ సభకు భారీగా తరలిన శ్రేణులు

- కార్లు, బస్సులు, మోటార్‌సైకిళ్లపై వెళ్లిన పార్టీ శ్రేణులు







పి.గన్నవరంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి, మలికిపురం: ఎమ్మెల్యే దేవకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నాయకులు

పి.గన్నవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. రాబోయే రోజుల్లో పవన్ కల్యాణ్ దిశానిర్దేశంతో పార్టీ మరింత బలపడుతుందన్నారు. ప్రజలు ఆశీర్వదించిన పార్టీని క్రమశిక్షణతో మరింత అభివృద్ధి చేసుకోవాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి అభిమానులకు, పార్టీ శ్రేణులకు స్వీట్లు పంచారు. మామిడికుదురు మండలానికి చెందిన దివ్యాంగుడు జోగి రాంబాబుకు ఎమ్మెల్యే పార్టీ జెండాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక థియేటర్ వరకు పాదయాత్ర నిర్వహించి అక్కడ చిత్రాడ ఆవిర్భావ సభకు వెళ్లే భారీ వాహన శ్రేణి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. పి.గన్నవరం నియోజకవర్గం నుంచి భారీసంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు, కార్యకర్తలు చిత్రాడ సభకు తరలివెళ్లారు. లంకలగన్నవరం లాకు వద్ద జనసేన యువత ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్‌చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు పార్టీ జెండాలను ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయికృష్ణ, ఆదిమూలం సూరయ్య కాపు, అడబాల తాతకాపు, యడ్ల ఏసు, తాటికాయల శ్రీనివాసరావు, కోట రాజేంద్రప్రసాద్, షేక్ దొరబాబు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

మలికిపురం నుంచి జన సైనికులు

మలికిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నేతృత్వంలో చిత్రాడలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు రాజోలు నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో జనసైనికులు తరలివెళ్లారు. వందలాది వాహనాల్లో జనసైనికులు బయలుదేరగా ఎమ్మెల్యే దేవ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జనసైనికులు, వీర మహిళలు మలికిపురం సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి వీరంతా ర్యాలీగా బయలుదేరారు. మలికిపురం సెంటర్‌లో ఎమ్మెల్యే దేవ జనసేన జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేకు, జనసైనికులకు టీడీపీ శ్రేణులు దగ్గరుండి సంఘీభావం తెలిపారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి తదితరులు ఎమ్మెల్యేకు సంఘీభావం తెలిపారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, మల్లిపూడి సత్తిబాబు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి పాల్గొన్నారు.

జనసేన జెండాల ఆవిష్కరణ

అంబాజీపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడ జనసేన పార్టీ ఆవిర్భావ సభకు మండలం నుంచి జనసైనికులు, వీర మహిళలు భారీగా తరలివెళ్లారు. పలు గ్రామాల్లో జనసేన పార్టీ ఆవిర్భావం సందర్భంగా పార్టీ పతాకాలను ఆవిష్కరించి కేక్‌లు కట్ చేశారు. అనంతరం భారీ ర్యాలీగా స్థానిక సెంటర్ నుంచి కార్లు, బస్సులు, బైక్‌లలో తరలివెళ్లారు. ఈర్యాలీని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్థానిక సెంటర్లో ప్రారంభించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, వెంకటేశ్వరరావు, అక్కిశెట్టి ప్రసాద్, అల్లాడ రవి, అరిగెల బుజ్జి, సుదా బత్తుల రమేష్ తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

కార్లు, వ్యాన్లు, మోటారుసైకిళ్లపై

ముమ్మిడివరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి జనసైనికులంతా భారీ స్థాయిలో తరలివెళ్లారు. శుక్రవారం ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపం వద్ద కేక్‌ను కట్‌చేసి అక్కడి నుంచి కార్లు, మోటారు సైకిళ్లు, ప్రత్యేక వాహనాలపై ర్యాలీగా తరలివెళ్లారు. గోదశి పుండరీష్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి 50కార్లు, వ్యాన్లు, మోటారు సైకిళ్లపై జనసైనికులు, వీరమహిళలు తరలివెళ్లారు. ఈసందర్భంగా జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేశారు. నియోజకవర్గం నుంచి 10వేలమంది ఆవిర్భావ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో కర్రా దుర్గాప్రసాద్, దూడల స్వామి, మాదాలశ్రీధర్, గొలకోటి సురేష్, కామన ప్రసాద్‌గౌడ్, గొలకోటి సురేష్, గాలిదేవర బుల్లియ్య, పెద్దిరెడ్డి సర్వేష్, జగతా శివ, పాయసం సాయి, వక్కపట్ల గణేష్, కూనపరెడ్డి కిరణ్, సుంకర మణికంఠ పాల్గొన్నారు.



అమలాపురం: చిత్రాడ సభకు వాహనాలను ప్రారంభిస్తున్న నల్లా శ్రీధర్ తదితరులు

కార్లు, బస్సులకు జనసేన జెండాలు

మామిడికుదురు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడలో జరిగిన జనసేన ఆవిర్భావ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో జనసైనికులు తరలివెళ్లారు. నగరంలోని జనసేన స్థూపం వద్ద పార్టీ పతాకాన్ని మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా ఆవిష్కరించి అక్కడి నుంచి ఆవిర్భావ సభకు బయలుదేరి వెళ్లారు. కార్లు, బస్సులు, మోటారుసైకిళ్లకు పార్టీ పతాకాలు అలంకరించి జనసైనికులు, వీరమహిళలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో అడబాల తాతకాపు, విళ్ల సుబ్బారావు, తుందూరి బుజ్జి, పేరూరి సతీష్, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పార్టీ పతాకాలతో నినాదాలు

ఉప్పలగుప్తం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు తరలివెళ్లారు. శుక్రవారం గొల్లవిల్లి నుంచి బైకులు, కార్లు, బస్సుల్లో వారు ఆవిర్భావ సభకు పార్టీ పతాకాలతో నినాదాలు చేస్తూ వెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఇనుకపట్ల రఘుబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఆకుల బుజ్జి, చిక్కం సుధ, ఏవీ కృష్ణారావు, సలాది నాగరాజు, మంచెం బాలకృష్ణ, గుత్తాల సుభాష్‌చంద్రరావు, దంగేటి బాబులు, గొలకోటి తాతాజీ, సాకా రాంబాబు, సుందరనీడి ఏసు, మద్దింశెట్టి ప్రసాద్, మారిశెట్టి నాని, సత్తి చిన్నా, గనిశెట్టి వీరు, బెండా సతీష్, నాగులపల్లి సతీష్, పెమ్మాడి శ్రీను తదితరులు ఉన్నారు.



ముమ్మిడివరం: కేక్ కట్‌చేసి ఆవిర్భావ దినోత్సవానికి తరలివెళుతున్న జనసేన నాయకులు

గ్రామాల నుంచి ర్యాలీగా

అంతర్వేది, మార్చి 14(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి సెంటర్‌లో జనసేనపార్టీ 12వ ఆవిర్భావ వేడుకలను నీటిసంఘ అధ్యక్షుడు నామన నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్ జెండాను ఆవిష్కరించారు. గ్రామాల నుంచి జనసేన నాయకులు, ప్రజాప్రతినిధులు ర్యాలీగా మలికిపురం చేరుకుని ఎమ్మెల్యే వరప్రసాద్‌తో కలిసి పిఠాపురం తరలివెళ్లారు. తాడి మోహన్‌కుమార్, నల్లి లక్ష్మణరావు, గునిశెట్టి రాంజీ, నాయుడు కృష్ణ, మేడిచర్ల శేఖర్, బైరా నాగరాజు, పోతురాజు వెంకటరత్నం, ఉండపల్లి అంజి, రావూరి నాగు, ఆకన బాబ్జినాయుడు, జనసైనికులు, వీర మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భారీ కాన్వాయ్‌గా

రాజోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు రాజోలు నుంచి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ కాన్వాయ్‌గా తరలివెళ్లారు. బస్సులు, కార్లు, టాటా మ్యాజిక్, ఇతర వాహనాలపై జనసేన నాయకులు, సైనికులు, వీర మహిళలు అధిక సంఖ్యలో చిత్రాడ బహిరంగ సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, పొదలాడ నీటిసంఘం అధ్యక్షుడు ఉలిశెట్టి లక్ష్మణరావు, గుండాబత్తుల తాతాజీ, కోళ్ల బాబి, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

కాట్రేనికోన, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి జనసేన అధ్యక్షుడు రంబాల చౌదరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కాట్రేనికోన పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం చిత్రాడ సభకు తరలివెళ్ళారు. కార్యక్రమంలో రంబాల రమేష్, మాగాపు పట్టాభి, మాగాపు ఈశ్వర్, ర్యాలి సాయి, ర్యాలి బద్రి, మాగాపు మల్లేష్, రంబాల తాతరాజు, సలాది బుల్లి, రంబాల బాబులు, రంబాల మణికంఠ, సలాది శ్రీను పాల్గొన్నారు.

టైలరింగ్‌లో శిక్షణకు పేర్లు నమోదు చేసుకోవాలి

అమలాపురం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భవిష్యత్తుపై భరోసా పెంచేలా స్వయం ఉపాధి పథకం కింద టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి ఉన్న మహిళలు తమ పేర్లను సంబంధిత సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు కోరారు. వెనుకబడిన తరగతుల వారితో పాటు ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ, కాపు సామాజిక వర్గాలకు చెందిన మహిళలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. 18 నుంచి 50ఏళ్లలోపువారు అర్హులని, తప్పనిసరిగా రైస్‌కార్డు కలిగి ఉండాలని, కమ్యూనిటీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, మొబైల్ నంబరుతో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని, నిష్ణాతులైన వారితో శిక్షణ అనంతరం కుట్టుమిషన్లు మంజూరు చేస్తామని కమిషనర్ తెలిపారు.

యానాంలో స్విమ్మింగ్ పోటీలు



యానాం,మార్చి 14 (ఆంధ్రజ్యోతి): యానాం భారతీయ క్రీడాప్రాధికార సంస్థ (శాయ్) యానాం శాఖ ఆధ్వర్యంలో స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. యానాం పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈపోటీలను పరిపాలనాధికారి మునిస్వామి ప్రారంభించారు. అండర్ 12,14,17 విభాగాల్లో బాల, బాలికలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. పోటీలను యానాం శాయ్ ఇన్‌చార్జ్ ఉదయ్‌కుమార్ పర్యవేక్షించారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే భారీ జరిమానాలు

అమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగిస్తే జీవోఎంఎస్ నంబరు 81 ప్రకారం జరిమానాలు విధిస్తామని కామనగరువు పంచాయతీ కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు ఆయా షాపులకు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు భూమిలో డీకంపోజ్ అయ్యేందుకు ఎక్కువకాలం పడుతుండడంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడి ప్రజారోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించి జూట్ బ్యాగులు, వస్త్ర బ్యాగులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈనెల16వ తేదీ తరువాత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించే వీధి వ్యాపారులకు మొదటి నేరం కింద రూ.2500 జరిమానాతో పాటు నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకుంటామన్నారు.

ముగిసిన బీపీఎల్ క్రికెట్ పోటీలు

అమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో పది రోజులుగా జరుగుతున్న బీపీఎల్ క్రికెట్ పోటీలు ముగిసినట్టు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్, మురళీ తెలిపారు. ముగింపు వేడుకలకు బీవీసీ కళాశాలల చైర్మన్ బోనం కృష్ణసతీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్‌కు చేరిన క్యాడ్ ఎంఎల్ జట్టు నిర్ణీత 14ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 114పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌చేసిన సివిల్ జట్టు 14ఓవర్లకు ఎనిమిది వికెట్లు కోల్పోయి 96 పరుగులు మాత్రమే చేసింది. విజేతగా నిలిచిన క్యాడ్ ఎంఎల్ జట్టుకు చైర్మన్ కృష్ణసతీష్ షీల్డు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ మధన్, డిప్లమో ప్రిన్సిపాల్ ఫణి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

తులిప్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

అమలాపురం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అమలాపురం తులిప్స్ పబ్లిక్ స్కూలులో గ్రాడ్యుయేషన్ డేతో పాటు జాతీయ సమైక్యతను చాటిచెప్పే విధంగా ఫ్యాన్సీ డ్రస్ పోటీలు ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయక దుస్తులు ధరించి వివిధ రకాల వేషధారణలతో ఎల్‌కేజీ విద్యార్థులు ఆకట్టుకున్నారు. యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రస్ పోటీల విజేతలకు డైరెక్టర్ నెల్లి రమేష్, ప్రిన్సిపాల్ నెల్లి సబితలు బహుమతులు అందజేశారు.

జేసీఐ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

అమలాపురం టౌన్, మార్చి14(ఆంధ్రజ్యోతి): జేసీఐ అమలాపురం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు సిద్ధార్థ భట్నాగర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేద మహిళలకు కుట్టు మిషన్లు, పలు కుటుంబాల వారికి మడత మంచాలు అందజేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అమలాపురం శాఖ అధ్యక్షురాలు వాడ్రేవు శ్రీవాణిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అధ్యక్షుడు టి.భరత్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీఎస్ఆర్ అరవింద్, పూర్వ అధ్యక్షుడు వాడ్రేవు శ్రీరామ్, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, మాకిరెడ్డి మనోజ్, ఆకొండి చాణుక్య, చిర్రావూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): హోమియోపతి వైద్య విధానానికి ఒక ప్రత్యేక ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పేర్కొన్నారు. పేరూరు బేతాళస్వామి ఆలయం వద్ద శుక్రవారం డాక్టర్ కేర్ హోమియోపతి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని చంద్రమౌళి ప్రారంభించారు. సర్పంచ్ దాసరి అరుణ, సీనియర్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ హోమియోపతి వైద్యానికి ఆదరణ పెరుగుతుందన్నారు. 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ హరిత, దాసరి డేవిడ్, జల్లి శ్రీనివాస్, మేనేజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యానాం వెంకన్న చక్రస్నానం

యానాం,మార్చి 14(ఆంధ్రజ్యోతి): యానాంభూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి చక్రతీర్థం, చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం గౌతమి గోదావరిలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. మద్దింశెట్టి సత్తిరాజు కుమారుడు ప్రసాద్ ఉత్స వదారులుగా ఉన్న తెప్ప తెన్నాలఉత్సవం, చంద్రోత్సవ వాహనంపై స్వామివారిని ఊరేగించారు.

మట్టి తోలకాలు నిలుపుదల చేయాలని ధర్నా

ముమ్మిడివరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అయినాపురం బాడవ రోడ్డులో గత పదిహేను రోజులుగా మట్టి ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అయినాపురం సర్పంచ్ మోకా రామారావు ఆధ్వర్యంలో శుక్రవారం అయినాపురంలో మెట్లలంక రోడ్డుపై టెంట్‌వేసి ధర్నా నిర్వహించారు. బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంటకాల్వను ఆనుకుని అక్రమంగా రొయ్యలచెరువు తవ్వి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని, దీనివల్ల రోడ్డు ధ్వంసం అవుతుందని వారు ఆరోపించారు. ఈవిషయాన్ని కలెక్టర్, ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లడంతో తోలకాలు నిలుపుదల చేశారని, మళ్లీ యథావిధిగా మట్టి తోలకాలు సాగిస్తున్నారని, దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సర్పంచ్ రామారావు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆందోళన కొనసాగింది. ఎం.నరేష్, రెడ్డి బాబులు, సంసాని అశోక్, మోకా బాలజాన్, పోలిశెట్టి నాగేశ్వరరావు, జి.దుర్గాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అంతర్వేది, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ చైర్మన్, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు పిలుపునిచ్చారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి విచ్చేసిన ఆయనకు నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయం ఎదురుగా వారు సమావేశమయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సరెళ్ల ప్రసన్నకుమార్, తోటే ప్రతాప్, దేశినీడిఉదయభాస్కరరావు, అల్లూరి మధురవిరాజు, గొల్ల లతీష్‌కుమార్, కొంబత్తుల ఆసిబాబు, ఈద మహలక్ష్మి, తాడి నీలకంఠం, తాడి ఆనంద్, తిలక్, వడ్డే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి నిత్యాన్నదానానికి రూ.1,11,116 విరాళం

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ చైర్మన్, ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు, కుటుంబ సభ్యులు రూ.1,11,116 విరాళాన్ని ఆలయ ఏసీ వి.సత్యనారాయణకు అందించారు. దాతలకు ఆలయ సంప్రదాయ మర్యాదలతో స్వామివారి దర్శనం అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

ఘనంగా శ్రీకాట్రుమాయమ్మ జాతర మహోత్సవాలు

రాజోలు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడులో వేంచేసి ఉన్న శ్రీకాట్రుమాయమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర మహోత్సవం సందర్భంగా ప్రముఖ జబర్దస్త్ నటులు మహేష్, నూకరాజు, హరిత పాల్గొని భక్తుల్లో ఉత్తేజం నింపారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. జాతర మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రెండు వేల క్యూసెక్కుల సాగునీరు విడుదల

రాజోలు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి ఎద్దడి ప్రాంతాలను స్వయంగా పరిశీలించి నీటి ఎద్దడితో రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితిని సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ గుర్తించారు. దీనిపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను శ్రీనివాస్ కలిసి ఈనెల10న శివారు భూముల పంట పొలాలకు నీరందేలా ఆయిల్ ఇంజన్ల ద్వారా 2వేలక్యూసెక్కుల నీటిని పెంచి పంట పొలాలకు అందించాలని కోరారు. గోదావరి సెంట్రల్ డెల్టా చరిత్రలో రబీ సీజన్‌కు అత్యధికంగా 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయించి రైతులకు నీరు ఇబ్బంది లేకుండా చేశామని శ్రీనివాస్ తెలిపారు. నీరు విడుదలతో రైతులు హర్షం వ్యక్తంచేస్తూ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలుతెలిపారు.

ఘనంగా హోలీ వేడుకలు

ముమ్మిడివరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడలా చిన్నారులు కేరింతలు కొడుతూ హోలీ వేడుకలు జరుపుకున్నారు. నగర పంచాయతీ పరిధి చింతలమెరక గ్రామంలో హోలీ సందర్భంగా చిన్నారులు ఒకరినొకరు రంగులు పూసుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని చిన్నారులు పేర్కొన్నారు. మణిరాజిత, నిహారిక, మనోసూర్య, మణికంఠ, నాని, ఆరాధ్య, సాహిత్య, గౌతమ్, తన్వి పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకలను వాడవాడలా నిర్వహించారు. చిన్నారులు రంగులు చల్లుకుని సందడి చేశారు. రంగునీళ్లతో రోడ్లపైకి వచ్చి కేరింతలు కొట్టారు. హోలీ పండుగను చిన్నారుల నుండి పెద్దల వరకూ ఆనందంగా జరుపుకున్నారు. రంగుల పూసుకుని సెల్ఫీలు తీసుకున్నారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోలాటం గురువు రామకృష్ణకు ఘన సన్మానం

అమలాపురం రూరల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీశ్రీనివాసా బాలమిత్రసంఘం ఆధ్వర్యంలో 60మంది మహిళలు, యువతులకు గురువు ఏటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో కోలాటం నేర్పించారు. శ్రీశ్రీనివాసా కోలాట భజన మండలి వారి గజ్జల పూజను కన్నుల పండుగగా నిర్వహించారు. స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆధ్యాత్మిక కోలాట నృత్య ప్రదర్శన రాత్రి వరకు నిర్వహించారు. ప్రదర్శన అనంతరం గురువు రామకృష్ణతో పాటు శిక్షణ అందించిన మధు, మణిల బృందాన్ని దుశ్శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. బాలమిత్ర సంఘం అధ్యక్షులు చింతపట్ల బాబు ఆధ్వర్యంలో జరిగిన సన్మానోత్సవంలో గ్రామప్రముఖులు ఉప్పుగంటి భాస్కరరావు, బళ్ల స్వామివివేకానంద-మాచరమ్మ, కార్యానిస్టు మాడా రాము, అంకం పెదరాజు, బిళ్ల విశ్వేశ్వరరావు, లక్కింశెట్టి ఫణిరాజు, ఊటుకూరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని రిలే దీక్షలు

అమలాపురం టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపో డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. రిలే దీక్షలో జీఆర్ కృష్ణ, కేఎస్ రామయ్య, కె.శ్రీనివాసరావు, కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. 1/2019 సర్క్యులర్‌ను అమలుచేయాలని, నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిపో అధ్యక్షుడు ఓలియా, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కె.రంగప్రసాద్ యూనియన్ ప్రతినిధులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు

అంతర్వేది, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం గ్రామం మెండుపాలెం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో కుంకుమపూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులు అధిక సంఖ్యలో విందు భోజనాలు చేశారు. అలాగే మోరి గ్రామంలో మహాలక్ష్మమ్మ, కనకమహాలక్ష్మమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి డ్రామా కంపెనీ, డ్యాన్స్‌షో, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

తాండవపల్లిలో చోరీ

అమలాపురం రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తాండవపల్లి గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన తటవర్తి వెంకటరత్నం ఈనెల13న కుటుంబ సభ్యులతో కలిసి తుని వెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడం, తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గుర్తించి అమలాపురం తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో ఉన్న రూ.10వేలు నగదు, ఎనిమిది గ్రాముల బంగారం అపహరణకు గురైనట్టు వెంకటరత్నం ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ ఏసుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆక్వా చెరువులకు గండ్లు



సీఆర్‌జడ్ పరిధిలో ఆక్వాచెరువులకు గండ్లు కొట్టిన దృశ్యం

అంతర్వేది, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, అంతర్వేది, అంతర్వేదిదేవస్థానం, పల్లిపాలెం గ్రామాల్లో సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న ఆక్వా చెరువులకు ఎన్జీటీ ఆదేశాల మేరకు గండ్లు కొడుతున్నట్లు తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కేశవదాసుపాలెంలో 13 చెరువులు, అంతర్వేదిలో 15 చెరువులు గండ్లు కొట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. మిగిలిన అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెంతో కలిపి 260ఎకరాల్లో సీఆర్‌జెడ్ పరిధిలో 206చెరువులకు గండ్లు కొట్టేందుకు చర్యలు చేపడుతున్నట్టు తహశీల్దార్ తెలిపారు.

సీసీ కెమెరాలు అందజేసిన మెట్రోకెమ్ అధినేత బాలాజీ



పి.గన్నవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు(బాలాజీ) రూ.1,73,500 సమకూర్చినట్టు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. ఇప్పటికే మండలంలోని పలు ప్రాంతాల్లో 12ముఖ్య కూడళ్లలో 33 సీసీ కెమెరాలు ు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నందెపు బాలాజీ అందచేసిన 15 కెమెరాలను పోతవరం, ముంగండ గ్రామాలతో పాటు పలు కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. ఈసందర్భంగా నందెపు బాలాకి డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్‌ఐ శివకృష్ణలు అభినందలు తెలిపారు.

సత్యనారాయణస్వామికి అభిషేకాలు

మామిడికుదురు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాకనపాలెంలో సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం వ్రతాలు ఘనంగా జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు కర్తలుగా పాల్గొని ఈవ్రతాలు ఆచరించారు. చివరిరోజు శుక్రవారం స్వామివారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.12లక్షలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టోత్తర పూజలు, అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందిస్తున్న దాతలు

ఆత్రేయపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,12,369 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లంసూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి జొన్నాడకు చెందిన తాడి సత్యవంశీరెడ్డి-శ్రావ్య దంపతులు రూ.1,11,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఉపకమిషనర్ పరిశీలించారు.

ఘనంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి14(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి ఆండాళు సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గోవిందమాలధారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి శుక్రవారంస్వామివారికి మహాశాంతిహోమం, పూర్ణాహుతి, తిరుచ్చి వాహనోత్సవసేవ, చక్రస్నానం,



స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

బ్రహ్మారనోత్సం, రాత్రి ఏకాంత సేవ ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఫాల్గుణ పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి, పీఠంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రాయవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గాపీఠంలో ఫాల్గుణ పౌర్ణమిపూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి పురస్కరించుకుని విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుతగా విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసిదళ అర్చనలు చేశారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్రనామాలు, దుర్గాత్రిశతి, ద్వాతింశ నామావళి, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమపూజలు , భవాని శంకరస మేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఫాల్గుణ పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్య కనక దుర్గ, పీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరామస్వామి పట్టాభిషేకం

● రామనామస్మరణతో మార్మోగిన సీతానగరం

మండపేట, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడిద సీతానగరంలో వున్న శ్రీకోదండ రామ స్వామివారి 80వ వార్షికోత్సవంను పురష్కరించుకుని గత ఐదురోజుల నుంచి గ్రామంలో జరుగుతు న్న అధ్యాత్మిక కార్యక్రమాలతో మార్మోగుతోంది. శుక్రవారం స్వామివారికి శ్రీరామ పట్టాభిషేకం, యాగహోమాలు నిర్వహించారు. ఆలయం చెంతనే నూతనంగా నిర్మించిన ఫంక్షన్‌హాలులో జరిగిన కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని సప్తనది జలాలు, నాలుగు సముద్రజలాలతో గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. మహిళలు కళశాలతో యాత్రసాగింది. అనంతరం యాగశాలవద్ద స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టాభిషేకం చేశారు. ఆశేష భక్తజనం నడుమ రాములవారి పట్టాభిషేకానికి తరలివచ్చారు. గ్రామానికి చెందిన సంగరాజు కుటుంబ సభ్యులు స్వామివారికి బంగారు కిరీటం వెండిపాదుకలతోపాటు, పల్లకి, రథంను అందజేశారు. పట్టాభిషేకం అనంతరం సాయంత్రం స్వామి వారికి కల్యాణం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కునంత వేంకటేశ్వరరాజు, సీతారామరాజు, కృష్ణంరాజు, రుద్రరాజు సత్యన్నారా యణరాజు, నంబూరి లక్ష్మీనారాయణరాజు, వేగిరాజు గోపాలకృష్ణంరాజు, మాజీ ఎంపీటీసీ పెన్మెత్స రమేష్‌రాజు, ఆలయ అర్చక స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



వై.సీతానగరంలో కోదండరామస్వామివారి పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆనందోత్సాహాలతో హోలీ



రావులపాలెం, వెదురుపాకలో హోలీ సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

కపిలేశ్వరపురం, మార్చి14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం హోలీ పండుగను ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుకున్నారు. ఈసందర్భంగా చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. చిన్నారులు రంగురంగులతో, నీళ్ల చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాలు పంచుకున్నారు.

రాయవరం: మండలంలోని 12 గ్రామాల్లో హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వెదురుపాక గ్రామంలో చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీని ఆనందంగా జరుపుకున్నారు. పాఠశాలలకు సెలవు కావడంతో మండలంలోని మిగిలిన గ్రామాల్లో చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ సందడి చేశారు. హోలీ పురస్కరించుకుని పలు వీధులు రంగులతో దర్శనమిచ్చాయి.

ఆత్రేయపురం: హోలీ వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రంగులు పూసుకుని సందడి చేశారు. వృద్ధుల నుంచి చిన్నారుల వరకూ రంగులు చిమ్ముకుని వేడుకలు నిర్వహించుకున్నారు. చిన్నారులు రోడ్లపైకి వచ్చి ప్రతిఒక్కరిపై రంగులు చల్లారు.

హోలీ సంబరాలు

రావులపాలెం: హోలీ పండుగను పురస్కరించుకుని చిన్నారులు రంగులు పూసుకుని సంబరాలు చేసుకున్నారు. రావులపాలెం మండలంలోని గ్రామాల్లో శుక్రవారం చిన్నారులు, యువత ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ సంబరాలు జరుపుకున్నారు.

వాకింగ్ ట్రాక్‌కు శంకుస్థాపన

కపిలేశ్వరపురం, మార్చి14 (ఆందజ్యోతి) :మం డలంలోని అంగర జడ్పీ ఉన్నత పాఠశాల వెనుక ఉన్న గ్రౌండ్‌లో శుక్రవారం వాకింగ్ ట్రాక్‌కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. శ్రీ బలుసు వసుంధర మెమోరియల్ ట్రస్ట్ ద్వారా బలుసు సుబ్బారావు భార్య జ్ఞాపకార్థం నిర్మించనున్న ఈ ట్రాక్‌కు పడమరఖండ్రిక గ్రామసర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు



వాకింగ్‌ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నదృశ్యం

శంకుస్థాపన చేశారు. సుమారు రూ.14 లక్షలు వరకు ఈ ట్రాక్ నిర్మాణానికి ఖర్చు అవుతుందని నిర్వాహకులు తెలిపారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామపెద్దలు, గ్రామస్థులుపాల్గొన్నారు.



వెదురుపాకలో జనసేన స్థూపం ఆవిష్కరిస్తున్న నాయకులు



అంగరలో ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



రావులపాలెం నుంచి జనసేన ఆవిర్భావ సభకు తరలివెళ్తున్న జనసైనికులు



మండపేట నుంచి పిఠాపురం బయలు దేరి వెళ్తున్న దృశ్యం



ఆలమూరులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ఆవిర్భావ సభకు తరలివెళ్లిన జనసైనికులు

ఆత్రేయపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో నిర్వహించే జనసేన ఆవిర్భావ సభకు పార్టీ శ్రేణులు వేలాదిగా తరలివెళ్లారు. పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ జిల్లాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఆవి ర్భావ సభకు జనసైనికులు తరలివెళ్లారు. కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జనసైనికులు, వీరమహిళలు కార్లు, బస్సులు, బైక్‌ల ద్వారా ఆత్రేయపురం మండలం నుంచి భారీగా తరలివెళ్లారు.

రావులపాలెం: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో పిఠాపురంలో నిర్వహించే జనసేనపార్టీ ఆవిర్భావసభకు జనసైనికులు తరలివెళ్లారు. కొత్తపేట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యం లో నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి జనసేన నాయకులు, జనసైనికులు తరలివెళ్లారు. రావులపాలెంలోవాహనాల ఏర్పాట్లను మండలశాఖ అధ్యక్షుడు తోట స్వామి పర్యవేక్షించారు.

ఆలమూరు: జనసేనపార్టీ ఆవిర్భావ సభకు ఆలమూరు మండలం నుంచి ప్రత్యేక వాహనాలలో పిఠాపురంనకు బయలుదేరి వెళ్లారు. ఆలమూరు మండలం నుంచి వచ్చిన జనసైనికులు ముందుగా జొన్నాడ వద్ద పార్టీ స్థూపాన్ని జనసేనపార్టీ మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, నాయకులు సంగిత సుభాష్, గారపాటి శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేకవాహనాలలో భారీ ఊరేగింపుగా వెళ్లారు.

ద్రాక్షారామ: జనసేన ఆవిర్భావ దినోత్సవానికి శుక్రవారం రామచంద్రపురం నియోజకవర్గం నుంచి భారీగా జనసైనికులు తరలివెళ్లారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పట్టణం, మూడు మండలాల్లో పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు తరలివెళ్లారు.

వెదురుపాకలో జనసేన ఆవిర్భావ వేడుకలు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనసైనికులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ జనసేన పార్టీ మరింత బలోపేతానికి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తొలుతగా సత్యనారాయణపురంలో నిర్మించిన జనసేన పార్టీ స్థూపాన్ని, పార్టీ జెండాను ఆపార్టీ నేతలు ఆవిష్కరించారు. అనంతరం పిఠాపురంలో జరిగే జనసేన అధ్యక్షుడు, మంత్రి పవన్ కల్యాణ్ సభకు తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు వల్లూరి సత్యప్రసాద్, జిల్లా కార్యదర్శి దాలిపర్తి శ్రీనివాస్, మండల నాయకులు కొప్పిరెడ్డి తాతాజీ, అరుబోలు నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు చుక్కా గోవిందు, గ్రామశాఖ అధ్యక్షుడు నక్కారాజేష్, ఉపాధ్యక్షుడు యనమదల మురళి, రామశెట్టి చంద్రశేఖర్, అమజాల శ్రీను, సలాది ప్రసన్నకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో శుక్రవారం జనసేనపార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందోత్సవాల నడుమ జనసేన జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు పార్టీశ్రేణులు మాట్లాడుతూ ఎన్నోఆటుపోట్లను ఎదుర్కొని జనసేనపార్టీ ఈ స్థాయికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ వార్డుమెంబర్లు, పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, నాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపేట: పిఠాపురం నియోజకర్గ పరిధిలో చిత్రాడలో శుక్రవారం నిర్వహించిన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సభకు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ సారథ్యంలో భారీసంఖ్యలో బస్సులు ద్విచక్రవాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

నూకాంబికా అమ్మవారికి

పంచలోహ ఉత్సవ విగ్రహం

● 35కిలోల పంచలోహాలతో విగ్రహం తయారీ

● బహూకరించిన దాత శ్రీనివాస్

ఆలమూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా అమ్మవారికి పంచలోహ ఉత్సవమూర్తి విగ్రహాన్ని మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్ బహూకరించారు. మండపేటకు చెందిన శ్రీరామకృష్ణ బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్స్ అధినేత ప్రముఖ శిల్పి వాసా శ్రీనివాస్ రూ.1.25లక్షల విలువగల 35కిలల పంచలోహాలతో తయారుచేసిన విగ్రహాన్ని అమ్మవారి ఆలయానికి అందించారు. ఈనెల 15న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ఆలయంలో ఏర్పాటు చేయనున్నారు. ఈసందర్భంగా శిల్పి, దాత శ్రీనివాస్ మాట్లాడుతూ 35కిలోల వివిధ



పంచలోహ విగ్రహాన్ని తయారు చేసి బహూకరించిన దాత శ్రీనివాస్

లోహాలతో 30రోజులు శ్ర మించి తయారు చేసినట్లు తనతోపాటు అమ్మవారి ఉత్సవ విగ్రహం తయారీలో లంగోజు రఘుబాబు, అల్లం ఏడుకొండలు, గణేష్, వేగుళ్ల శ్రీనివాస్ తదితరులు విగ్రహారూపకల్పనకు సహకరించినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా పలు ప్రముఖ ఆలయాలలో పంచలోహ మూర్తులు రూపకల్పన చెయ్యడంతోపా టు ప్రముఖ ఆయోధ్య రామాలయంలో పాతిక కిలోల బాలరాముడి పంచలోహమూర్తిని గత కార్తికమాసంలో శ్రీనివాస్ సమర్పించిన సంగతి తెలసిందే.

విద్యతోనే సమాజాభివృద్ధి: ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మార్చి14(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజాభివృద్ధి చెందుతుందని ఎమ్మె ల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం మెర్లపాలెం శివారు వాసంశెట్టివారిపాలెంలో రూ.24లక్షలతో నిర్మించిన పాఠశాల భవ నాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మెర్ల రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత ప్రభుత్వం పాఠశాల భవనానికి నిధులు జమ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. స్థానికులు సొంత విరాళాలతో భవనం పూర్తిచేయడం అభినందనీయమన్నారు. ప్రజలు, ప్రభుత్వం భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి ముందుకు సాగాలన్నారు. అనంతరం పాఠశాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, జిల్లా



వాసంశెట్టివారిపాలెంలో పాఠశాల భవన నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, గుత్తుల పట్టాభి, ఎంపీడీవో రామన్, ఎంఈవో వరప్రసాద్, సాహెబ్, విద్యా కమిటీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు, కూటమినాయకులు పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ఆత్రేయపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వెలిచేరులో శుక్రవారం ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో సారా విక్రయిస్తున్న అత్తిలి ఊదలయ్యను ఐదు లీటర్ల నాటు సారాతో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించిన్నట్లు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.

శనేశ్వర ఆలయంలో మౌలిక వసతుల కల్పన

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మందపల్లి మందేశ్వర(శనేశ్వరస్వామి) ఆలయానికి భక్తులు పెద్దఎత్తున వస్తుండటంతో వారి మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆలయ పరిసరాలలో రూ.24లక్షలతో నిర్మిస్తున్న టాయిలెట్స్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం స్నానఘట్టాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా షెడ్ల నిర్మాణం పూర్తిచేశామన్నారు. అలాగే 8 యూనిట్లు మరుగుదొడ్ల నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, ముద్రగడ సుబ్బారావు, కొల్లి వీరాస్వామి, నక్కా రాఘవులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు'



మందపల్లిలో వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం జలజీవన్ మిషన్ ద్వారా కొత్తపేట పనసలదొడ్డి, పెదగూళ్ళపాలెం, మందపల్లి గ్రామాల్లో సుమారు రూ.1.80 కోట్లతో నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ వ్యాటర్ ట్యాంకు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, సిద్దంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, సాదు చెంచయ్య, బీర ఇసాక్, దేవపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం

కపిలేశ్వరపురం, మార్చి 14(ఆందజ్యోతి): మండలంలోని అంగరలో ఉన్న శ్రీరుక్మిణీ సత్యభామ సమే త శ్రీ వేణుగోపాలస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం నదివద్ద స్వామివారి చక్రస్నానం నిర్వహించారు. అనంతరం గరుడ, అశ్వ, గజ, సర్ప వాహనాలలో మేళతాళాలతో స్వామివారి ఊరేగింపు ఘనంగా జరిగింది. పెద్దింటి వెంకటలక్ష్మీనరసింహాచార్యులు, ప్రసన్నకుమార్ ఆచార్య లు, ఆలయ అర్చకులు ఎస్ఎల్ఎన్‌బీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో అంగర, పడమర ఖండ్రిక గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఆలయ ఈవో రాంబాబురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గారపాటికి సేవామూర్తి అవార్డు



హైదరాబాద్ యువ ఆర్ట్ థియేటర్స్ అధ్వర్యంలో అవార్డు స్వీకరిస్తున్న గారపాటి దంపతులు

ఆలమూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్‌చౌదరి పద్మజ దంపతులకు హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కళారంగ సంస్థ యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో స్త్రీశక్తి, సేవామూర్తి అవార్డులు స్వీకరించారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలు రంగాలలో సేవలు అందించిన వారికి అవార్డులు పంపిణీ చేశారు. ఈఅవార్డుల ప్రధానోత్సవంలో గారపాటి శ్రీనివాస్‌కు సేవామూర్తి, పద్మజకు స్త్రీశక్తి అవార్డులకు ఎంపిక చేసి తెలంగాణా రాష్ట్ర తొలి శాసనసభాపతి ఎస్.మధుసూదనాచారి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక మండలి అధ్యక్షుడు వెన్నల గద్దర్, హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వరి, ప్రముఖగాయని మధుప్రియ సమక్షంలో అవార్డులు ప్రధానం చేశారు. గారపాటి శ్రీనివాస్ పద్మజ దంపతులను పలువురు అభినందించారు.

ఘనంగా గోగులమ్మ అమ్మవారి జాతర

ద్రాక్షారామ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెలంపాలెంలో ఉన్న గోగులమ్మ అమ్మవారి జాతర, తీర్థమహోత్సవం ఘనంగా జరిగింది. గురువారంరాత్రి అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి తీర్థమహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంవద్ద సిరిమాను ఉత్సవం నిర్వహించారు. గ్రామస్థులు అమ్మవారిని



సిరిమాను ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మృతుడి కుటుంబానికి సాయం అందజేత

కపిలేశ్వరపురం, మార్చి 14(ఆందజ్యోతి): మండలంలోని అంగరలో శుక్రవారం ఇటీవల మృతి చెందిన జనసేనపార్టీ వార్డు మెంబరు శివుడు గంగాధరం కుటుంబానికి గ్రామ జనసేన కార్యకర్తలు, జనసేన సేవాట్రస్టు ఆధ్వర్యంలో రూ.లక్షవెయ్యి ఆర్థిక సాయం అందజేశారు.



అంగరలో మృతుని కుటుంబానికి జనసేనపార్టీ ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్థికసాయం అందజేసి వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతు డు గంగాధరం పార్టీకి ఎనలేని సేవలందించారంటూ ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేవాట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

'సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలి'



రావులపాలెంలో నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

రావులపాలెం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అమలాపురం డిపోలో అక్రమంగా సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ బీఎస్ నారాయణను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ ఏపీ పీటీడీ ఎన్ఎంయూ అసోషియేషన్ ఆధ్వర్యంలో రావులపాలెం డిపోలో దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఎంఎస్ రాజు, కేజీ రావు, ఎస్ఎం లాల్, సీహెచ్‌వీ రెడ్డి శిబిరంలో కూర్చున్నారు. డ్రైవర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. రావులపాలెం ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఏఎస్ నారాయణ, జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ వీఎస్ నారాయణ, డిపో సెక్రటరీ పి.ఏసేబు దీక్షల్లో కూర్చుని వారికి సంఘీభావం తెలిపారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన



సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నఎంపీపీ, తదితరులు

ద్రాక్షారావం, మార్చి14(ఆంధ్ర జ్యోతి):రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించనున్న పలు సీసీ రోడ్లకు శుక్రవారం ఎంపీపీ అంబటి భవానీ శంకుస్థాపన చేశారు. ఎస్సీ శ్మశాన వాటికకు సీసీ రోడ్డు, చిన్నంపేటలో సీసీ రోడ్డు, డంపింగ్ యార్డు వద్ద సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ నిధులు కేటాయించారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్‌ఎంపీపీ శాకా బాబీ, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఉపసర్పంచ్ గంధం బుజ్జి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

కొత్తపేట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు కొత్తపేట ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి మండల పరిధి అవిడి గ్రామానికి చెందిన కడలి సత్యనారాయణను అరెస్టు చేసి అతని వద్ద 5 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేశామన్నారు.